# తెలుగు ప్రాణి

'మంచి కథలుకావాలి. అవీ ఉత్తమోత్తమంగా వుండాలి. అలాంటి వాటినే ప్రకటించి తెలుగు సాహిత్యానికీ, తద్వారా ప్రజానీకానికీ, పుష్టి, తుష్టి కలిగించాలి.''

ప్రతి సంపాదకుడూ యిలానే బయలుదేరుతాడు. యిలా బయలుదేరకపోయినా కనీసం యిలా అని ప్రకటిస్తాడు.

సరే! సంతోషం. కాని... ఉత్తమోత్తమం అంటే యేమిటి?

''రచనలో ఉద్వేగంవుండాలి. ఉత్త ఉద్వేగం చాలదు. భావనాశక్తి, శిల్ప ప్రావీణ్యం, సజీవభాష, పాఠకుణ్ణి వురకలుపెట్టించి మనస్సును వూటలూరించే సంవిధానం, సందేశం, ఒకటా? వీటన్నిటికంటే ముఖ్యంగా ప్రజాజీవిత చిత్రిణ-అదీ అభ్యుదయమార్గంలో వుండాలి.''

చాలా బాగుంది. అలా రచన వుండడం తప్పేమీకాదు. వ్రాయాలేగాని, వ్రాస్తే చాలా బాగుంటుంది. సందేహంలేదు. కాని వ్రాయడం ఎలా ?

ఏ అమెరికన్ రచయితకో అయితే యిన్ని చిక్కులేమీ లేవు.—రెండు సంపన్న కుటుంబాలు, వాటి మధ్య పరిచయం, ఆ రెండు కుటుంబాలకూ చెరో ఆడా మగా కుక్కలు, వాటికి మళ్లీ పరిచయం, ఆపరిచయం ప్రణయంలోకి పరివర్తనా, ఆ రెండు కుటుంబాలూ కొద్ది కాలం ఎడబాటూ, ఆ కుక్కల విరహం... యిలా గిలిగింతలు పెట్టుకుంటూ వెళ్లిపోతాడు. లేదా—ఓ నీగ్రో బాలిక కుక్కతో సంసారం. కాదా—ఓ నీగ్రో బాలిక అమెరికన్‌ని ప్రేమించి విరహంతో ఆత్మార్పణచెయ్యడం; అమెరికన్ ఐ పుట్టాలేగాని అతనికి ఖూనీలూ బందిపోట్లూ అన్నీ కథావస్తువులే. పోతే ఎవరేనా 'హౌవార్డుఫాస్టు' లాంటి యింకా రచయితలున్నా, వాళ్లు అనమెరికన్లు. కనుక వారి విషయం వేరు.

ఇక ఏ సోవియట్ రచయితనో తీసుకుందామా ? అతనికేం ? మానవత్వపు విలువలుగల మహా వ్యక్తుల్ని సృష్టించగలడు. అది అతని కేమీకష్టంకాదు. ఉత్తమోత్తమ రచనకు కావలసిన అన్ని హంగులూ అతని సమాజంలోనే వున్నాయి. అతను ఆ సమాజంలోనే పెరుగుతున్నాడు. భవిష్యత్తు వైపుకు పెద్ద పెద్ద

అంగలు వేసుకుంటూ పోతున్నాడు.

ఎటొచ్చీ — మన తెలుగు రచయితమాటే మిటి ? ముప్ఫయియేళ్ళ సాముతోనూ మూలనున్న ముసలమ్మనైనా కదపలేని ఆంధ్రనాయకుల రాష్ట్రంలో పుట్టాడు. పదవుల కోసం పత్రికల్లో రేపే ఉద్యమాల గాలిదుమారంలో పెరిగాడు. ఆ నాయకుల గాలివుపన్యాసాలు తింటూ పెద్దవాడయ్యాడు. యింతవరదాకా ఇంగ్లీషులో ఆలోచించి తెలుగులో వ్రాయాల్సివస్తే — యికముందు హిందీలో ఆలోచించి వ్రాయాల్సిన తెలుగు భాష అతడిది. ఇంట్లో పెళ్లాం, వుంటే బిడ్డలూ, ముసలీ ముతకా అంతా— బ్రతకాలేని బ్రతికించాలేని యీ రచనా వుద్యోగంమీద చెరిగిపోసే తిట్లూ తిమ్మలుమధ్య రచన కుపక్రమిస్తాడు. రచననుబట్టికాకుండా పేరునుబట్టీ — అదీ స్త్రీ వాచకమా ? కాదా ? అన్న భేదాన్నిబట్టీ అర్హతలు నిర్ణయించే పత్రికలకు పంపిస్తాడు. పుట్టిన దగ్గర్నుంచీ పుస్తకంమొగం ఎరగని పోలీసులు దాన్ని చదివి జనం చెడతారో పడతారో తేలుస్తారు.

తెలుగు రచయితగా పుట్టినంత పాపం అందులోనూ అభ్యుదయం లేక ప్రగతి ఏదేనాఅను. అదిగా వున్నంత మహా నరకం వేరే లేదనుకో...

అలాంటి రచయిత ఏం వ్రాస్తాడూ ?

"ప్రజల్లోనే బ్రతుకుతున్నావుగదా ! "

"బ్రతకడంలేదు. చావకండా వుంటున్నాను."

"పోనీ ఆ ప్రజాజీవితాన్నే-ఆ తెలుగుజీవితపు విలువల్నే"

"ఏమిటా జీవితపు విలువ_?"

చుట్టూ ప్రతినిత్యమూ, ఏదో ఓమూలనుంచి తుపాకుల ఠాం ఠాం వినిపిస్తోంటే ప్రతి ఠాంకు ఒకజీవితం నేలకు ఒరుగుతోంటే; 'యిది అన్యాయం' అనలేక, అంటే మరో ఠాం వినవలసివస్తుందేమోననే భయంతో, — ఆ ఠాం తనమీదికో, మరొకాడి మీదికో, తెలియని ఆందోళనతో - చీమలకంటే కనాకష్టంగా యీడ్చుతున్న యీ తెలుగుజీవితాల విలువ యేమిటిబాబూ ! ఆ జీవితానికి ఆధారాలైన ప్రాణాలు పరకలకంటే హీనమై పోతుంటే_ !

ఉదాహరణకు మాసీతారాముడినే చూడండి.

ఎప్పుడో ఇరవైయేళ్ళక్రితం పుట్టాడు. అందరు 'ఏకపుత్రిలు' లాగానే అతిగారాబంగా పెరిగాడు. గారాలకూచీల సంగతి వేరేచెప్పాలా? స్వయంగా ఏపనీ చెయ్యలేడు. ఇతరులు చెప్పింది చెయ్యడానికి 'ఏమో' అనేభయం. చదువూ అంతగా అతకలేదు. బజార్లో పది మందిలో మాట్లాడ్డానికూడా సిగ్గే. "ఇలాంటివాడు గదా పాపం" అని ఏళ్లు వూరుకుంటాయా? అవి అలా అలా పెరిగి పదహారేళ్ళ బాలాకుమారుణ్ణిచేసి వదిలాయి.

సరే-యిక యవ్వనపుపొంగులు. ఆపొంగులో ఆడవాళ్లకోసం వేట ప్రారంభించాడు. అన్నియిళ్ళకూ తిరుగడానికి వీలుగా నిప్పు అవసరం కలిగించే చుట్టా, బీడీ నేర్చుకున్నాడు. అలాగే కొద్దిమంది స్నేహితుల్ని కూడా అతికించుకున్నాడు.

సీతారాముడు పెళ్ళినాటికే, ఒకటీ అరా కామ కలాపాలు జరపడం; ఒకావిడ భర్తచేత తన్నులు తినడం అదంతా ఓ విషాదగాథ—

ఈ పేచీలన్నీ చూచాకనే వాళ్ళనాన్న 'ఇక లాభంలేద'ని ఓ పెద్దపెళ్లాన్ని తెచ్చి కట్టాడు.

కాని— 'తిరగనేర్చిన కాలు' మరి. అమావాస్యకూ, పున్నానికీ అలా అలా తిరుగుతో నేవుంది.

అందులోనూ ఆపెళ్లాంకుండా ఒక్కగానొక్క పిల్లే అయి పుట్టడంతో అతిగారాబం. చీటికిమాటికీ పుట్టింటి ప్రయాణాలు. 'నాకేం'? అన్న దిలాసా.

ఎలాగైనా అల్లుణ్ణి తమయింటికే తీసుకుపోతే, అన్ని విధాలా బాగుపడతాడనీ, చేతికీ కాలికీ అడ్డు వస్తాడనీ మామగారి ఆశ. కాని సీతారాముడు ఒప్పుకో లేదు. యిక వాళ్ళనాన్న సరేసరి. 'ఇల్లరికమా?' అని హుంకరించాడు.

ఇలావుంటుండగానే ఆవూళ్లో కొన్ని మార్పులు

జరిగాయి. కుర్రాళ్ళంతా కలిసి యువజనసంఘం అంటూ పెట్టారు. ఆటలు, పాటలు, నాటకాలూ ప్రారంభించారు. నెమ్మది నెమ్మదిగా సీతారాముడితో 'వ్రాసుపోక'కు తిరిగే జనంకూడా దొరక్కుండా పోయ్యారు. దాంతో తానుగూడా అందులో చేరిపోయాడు.

మొదట్లో అతడు నాటకాల్లో చేరడం ఆడవాళ్ళని తేలిగ్గా ఆకర్షించవచ్చనే. కాని రానురాను ఆడవాళ్ల సంగతే మరిచిపోయి తన వేషంలోనూ చదువులోనూ మునిగిపోయాడు.

'ఏమిటి ? యీనాటకాలూ వెధవ వేషాలూనూ' అని మొదట్లో తండ్రి పోరుపెట్టినా, కొడుకు బుద్ధిమంతనంచూచి, ప్రోత్సహించేదాకా వచ్చాడు.

యిప్పుడు సీతారాముడు చాలా మారిపోయాడు. తెల్లటి ధోవతిని వెనుక బిళ్ళగోచీ పెడ్తాడు; ముందు కుచ్చీళ్లు వదుల్తాడు. పొడుగాంటి లాల్చీ వేస్తాడు. మీసాలు నున్నగా గొరిగిస్తాడు. యింట్లోవుండే కాలంలో అధికభాగం అద్దంముందు నుంచుని అభినయం అలవాటు చేస్తుంటాడు. బయటికి వచ్చాడో — ఏదో ఒక పుస్తకం తదేక దీక్షతో అలాగే చదువుతుంటాడు. ఎప్పుడేనా తన ముందకే ఆడవాళ్లు వెళ్తుంటే మాత్రం కళ్ళెత్తి చూడటం పోలేదు. ఓ క్షణంపాటు వాళ్ళ సౌందర్యాన్ని 'స్టడీ' చేసి మళ్లీ పుస్తకంలో తలదూర్చివేస్తాడు.

ఎప్పుడేనా ఏ పుస్తకం దొరక్క, ఏ రిహార్సలూ లేకపోతే ఏ యల్లామో జ్ఞాపకానికి వస్తుంది. కాని మాసిపోయిన అపఖ్యాతిని మళ్లా ఎందుకు కొనుక్కు తెచ్చుకోడమని మానుకుంటాడు.

ఇదంతా అతని భార్యకూడా సంతోష కారణమే. అయితే అదివరకు వూళ్లోని ఆడవాళ్లమీాద వుండే కోపం — యిప్పుడు పుస్తకాలమీాదికి మళ్ళింది. "పెళ్లి పెళ్లామయిన తాను ఆ పుస్తకాలపాటి చెయ్యదా? . . .

.... యిలా వుండి వుండి సీతారాముడు ఆకస్మికంగా మారిపోయాడు.

పూర్వం ఆడవాళ్ల ముందు అయినవీ కానివీ అడ్డంగా కోసేవాడు; యీా మధ్య కాలంలో కనపడ్డ ప్రతివాణ్ణి నిలబెట్టి మరీ నాట్యకళమీాద వుపన్యాసాలు దంచేవాడు; యిప్పుడు పిలిచినా పలకడంలేదు. ఒకవేళ పలికాడా!

"నిన్నవాడు - యీారోజు నేను - రేపు నీవు - ఎల్లుండి అంతా—" అంటాడు.

"ఏమిట్రా అదీ?"

"అదే! అదే!"

బయటికి పోనిస్తే అంతా యిలా వాగిస్తా

రేమోనని వాళ్లనాన్న సీతారాముణ్ణి యిల్లు కదలనివ్వడం లేదు.

"ఏరా! నీవు పిచ్చాసుపత్రికి వెళ్లడం మంచిది"

"నిన్నవాడు - యీరోజు నేను - రేపు నీవు - ఎల్లుండి అంతా_"

"ఏమిట్రా ? అదీ"

"అదే - అదే"

భార్య గోలపెడుతోంది. మామకూడా దిగాడు అల్లుణ్ణి తీసుకుపోతానని - తండ్రికూడా ఆలోచించాడు. 'పొరుగూళ్లో ఐతే కొంత నయమేమో'! అని_

పట్టబలవంతాన ఎలాగైతేనేం అత్తగారింటికి గెంటారు. మందులిప్పిస్తున్నారు. సోదులడుగుతున్నారు. కాని సీతారాము డిది మానలేదు. పైగా ఒకనాటిరాత్రి పెళ్లాంతో "ఎల్లామనేనంటే పడిచస్తుందిగదా ! మల్లామ అలా ఎందుకు పడిచావదు ?" అని బ్రహ్మాండమైన ప్రశ్న వేశాడు.

యికనేం ? మర్నాడే ఎల్లామ చేతబడి చేయించిందని దాన్ని తిట్టిపోశారు. దయ్యాలకు పెట్టించారు. తీయించారు. కాని సీతారాముడిది మానలేదు. భూతవైద్యుడన్నీ ఐ, వచ్చిన దారి పట్టుంటే అతడినే అన్నాడు.

"నిన్నవాడు - యీరోజు నేను - రేపు నీవు - ఎల్లుండి అంతా_" అని

యీ చేతబడిగోలతో ఎల్లామకు మాత్రం మొగుడిచేతిలో వొళ్లు హూనామయింది. కాని సీతా రాముడి పిచ్చి అల్లాగే వుంది.

ఎలా మాన్తుంది? రోగం ఒకటీ? మందు మరొకటీ ఐతే—!

* * *

సీతారాముడు ఎంతగానో ఉబలాటపడ్డాడు. నాటకం వెయ్యాలనీ, తన వేషం మహాద్భుతంగా వుండాలనీ. రాత్రింబవళ్లూ అదేపనిగా అవస్థపడ్డాడు. ఎల్లామ, మల్లామ, తన భార్యా, జనం, అంతా ఎలా తనని పొగుడుతారో—!? అంతా కలలుగన్నాడు.

నాటకం నాటి రాత్రి. వేషం అంతా అయి పూర్తి ముస్తాబులో వున్నాడు. తెరల సందుల్లోనించి చూస్తోంటే – జనం మహాసముద్రంలా కన్పిస్తున్నారు. ప్రార్థన కూడా అయింది. తెర ఎత్తారు. మరుక్షణంలో తాను రంగంమీద నిలబడబోతున్నాడు. ఆజన మహాస ముద్రపు దృష్టులన్నీ తనమీద కేంద్రీకరించబడబో తున్నాయి.

యింతలోఆకస్మికంగా పిడుగుపడ్డట్టు.....

"నాటకం ఆపండి...."

"ఎందుకు?" ఎవరో అడిగారు. సీతా

రాముడుకాదు ఆ అడిగింది. అడిగేటట్టుకూడా లేదు. కొయ్యబారిపోయాడు.

" ఈ నాటకం ఆడితే ప్రజలు చెడతారు. శాంతిభద్రితలు ఇరుకున పడ్తాయి." వచ్చింది సమాధానం.

" మీరు చూడండి. ఈ నాటకంలో అలాంటి దేమీ లేదు."

హెడ్‌కానిస్టేబుల్ పుస్తకం అందుకున్నాడు. ఎడమచేత్తో పుస్తకం అడుగు పట్టుకున్నాడు. కుడిచేతి బొటనవేలు పైని ఆనించాడు. గిర్రున తిప్పాడు ప్రతి పేజీనీ ఆ బొటనవేలు తాకిచూచింది. పుస్తకం చూట్టం పూర్తయింది.

ఎందుకో తటపటాయించాడు హెడ్డు.

"పుస్తకం వ్రాసినవాడు తిరుగుబాటుదారండీ!"

"యీ తెరలుచూడండి. లక్ష్మిగాని, సరస్వతిగాని, చివరకు మన హనుమంతుడుగానీ వున్నారేమో! పట్టి తెరలండీ. పట్టివి."

" ఈ తబలాకు చుట్టిన గుడ్డ చూడండి. ఎర్రిగా"

వరుసాగ్గా దండకం చదువుకుపోతున్నాడు. ఆవూరి మోతుబరీ ఆసామిగారి బావమరది.

"సరే. ఆపండి నాటకం" హెడ్డు అన్నాడు.

"చూడండి. ఎన్నో వూళ్లనుంచి జనం వచ్చారు. తీరా యిప్పుడు..."

హెడ్డుతలకాయ కొంచెం మెత్తబడింది. కురిసే మంచుకుగాదు, అంతమంది జనాన్నిచూచి. జేబులో వెచ్చగా తగిలింది హెడ్డుకు.

"ఏమైనాసరే! నాటకం ఆపితీరాలి."

"ఆడతాం. ఆపం." అన్నారు ఎవరో...

ఆ అన్నవాడివంక చూచాడు హెడ్డు ఎర్రగా —అతగాణ్ణి అరెస్టు చేశానన్నాడు.

"ఎందుకో ?"

అది బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని అడగాలి. ఆ కామన్వెల్తు కూటమి నడగాలి. ఆ కామన్వెల్తు సంబంధాలతో ఆసియాకు నాయకత్వం వహిస్తాననే భారతదేశం చెప్పాలి.

మొత్తంమీద జరిగిందిదీ. నాటకం ఆగి పోయింది. జనం షాహుకార్నీ, పోలీసుల్నీ తిట్టుకుంటూ వెళ్లిపోయారు.

షాహుకారుమాత్రం—తన ముఠావేసే తారా శశాంకం కంటే వీళ్లు ముందు ఆడకుండానూ, అసలే

యిలాంటి నాటకాలు ఆడకుండానూ చేయించి, తన ఘరానా నిలబెట్టుకున్నందుకు సంతోషపడ్డాడు.

యింత జరుగుతూంటే సీతారాముడు వులకా పలకా లేదు. ఆరాత్రింతా కన్నుమూయ్యలేదు. కదలా మెదలా లేదు. మర్నాడల్లా అంతే. మర్నాటిసాయంత్రం పీకివేసిన పందిరిగుర్తులూ, రంగులు తుడుచుకున్న గుడ్డ పీలికలూ అన్నీచూస్తూ అన్నాడు, తన నాటకం గురువును అరెస్టుజేసినసంగతి గుర్తుకొచ్చి అన్నాడు.

నిన్న వాడు – యీరోజు నేను – రేపు నీవు – ఎల్లుండిఅంతా–" అని.

యీ విషయం అందరికీ తెలుసు. కాని వాడి రోగానికి కారణం యిదనిమాత్రం ఎవ్వరూ అనరు.

కాలం దొర్లిపోతోంది. మాటల్లోకి దించితే యీపిచ్చ వదుల్తుందేమోననుకున్నారు.

చూడవచ్చిన చుట్టమల్లా కూర్చోబెట్టి మరీ తెగమాట్లాడుతున్నారు. అందువల్ల సీతారాముడి ధోరణి యింకా పెరుగుతోంది. ఔనుమరి! ఆ వచ్చినవాళ్లు మాత్రం ఏం మాట్లాడుతున్నారు?

ఏ ఉత్తర హిందుస్థానం వాళ్ళో ఐతే మతకలహాల మీద మాట్లాడుదురు!

పట్టాభిగారైతే శరణార్థులమీద మాట్లాడును

రంగాగారైతే మిలటరీపాలన అవశ్యావశ్యాన్ని గురించి మాట్లాడును !

రాజేన్‌బాబూ ఐతే బుద్ధుడి అహింసావిధానాన్ని వర్ణించును !

ఈ మాట్లాడే వాళ్ళంతా తెలుగు నాయకులన్నా కాదామె. తెలుగువాళ్లు. వుత్త తెలుగువాళ్లు. పాపం ! వాళ్లేమి మాట్లాడ్తారూ ? కన్నవీ, విన్నవీ—

"ఆవూళ్లో జనాన్ని నిద్రలో లేపి మరీ చావబాదారు." ✓

"అదే—అదే" సీతారాముడు అనేవాడు.

"కందిచేలో ఒకణ్ణి కాల్చారు."

"ఎక్కడెక్కణ్ణుంచో పట్టుకొచ్చి మావూరి పొలిమేరలో కాల్చారు."

"నిన్న వాడు - యీరోజు నేను— రేపు నీవు— ఎల్లుండి అంతా—" ప్రతిదానికీ యిదే వరుస సీతారాముడిది. కాకపోతే అప్పుడప్పుడూ "అదే - అదే" అంటుండేవాడు.

విశ్రాంతికని ఎక్కడెక్కడో తిరిగారు. కాని అక్కడక్కడా బస్సుల్లోనూ. రైళ్ళల్లోనూ, హోటళ్ళల్లోనూ అవే కబుర్లు విన్నాడు. ఔనుమరి. తెలుగు దేశంలో అంతకుమించి ఏమున్నాయి ? వినేందుకు —

ఇరవైరెండు

సీతారాముడిప్పుడు యింటిపట్టునే వుండడం లేదు. సీతారాముణ్ణి ఏంచెయ్యాలో ఎవ్వరికీ తోచడం లేదు.

ఒకరోజున సీతారాముడికేం పుట్టిందో — ఆ రోజల్లాయింటి మొగమే చూళ్ళేదు. చీకట్తోలేచి దేవాలయంలోకి వెళ్లాడు. పసుపు కళ్ళానికి వెళ్ళాడు. బీట్లోకి పోయాడు. కాట్లోకి పోయాడు. ఏట్లోకి పోయాడు. మళ్ళీ వూరువేపు మళ్ళాడు

వెనకనుంచి 'భర్-భర్ర్- ' వినిపించింది.

తిరిగి చూచాడు. దుమ్ము లేస్తోంది.

"లారీ—లారీ" యిన్నాళ్ళకు యింకోమాట మాట్లాడాడు సీతారాముడు.

పరుగెత్తబోయాడు. పడ్డాడు. లేవబోయాడు. పడ్డాడు. పడి - పడి - పట్టుబడనే - పడ్డాడు.

మామా, పెళ్లాం, తండ్రీ, అంతా గొల్లున గోలబెట్టారు.

"నిన్న వాడు - యీ రోజు నేను - రేపు మీరు"

సీతారాముడి గూబ గుయ్యిమని కదిలింది. మామా, తండ్రి, పెళ్ళాం కళ్ళు గిర్రున తిరిగాయి.

"చెప్తావా ? లేదా ?" సీతారాముడి రెండో దవడ పగిలింది.

K. Anka Reddy



"అదే అదే" అన్నాడు సీతారాముడు.

చీలమండ విరిగింది. "తేల్చు-ఊఁ"

"నిన్న వాడు-యీరోజు నేను-రేపు మీరు-"

"ఏమిటది?" తుపాకిసన్నీ రొమ్ముల్ని ఆనుకుంది.

"అదే-అదే-"

చుట్టూ 20 తుపాకులు కాపలా కాస్తుండగా సీతారాముడు లారీలోపడి వెళ్లిపోయాడు.

ఆ తర్వాత 10 రోజులకల్లా ఆంధ్ర దేశానికంతా తెలిసింది. పత్రికల్లో పడి :—

సీతారాముడు ఏయే దాడుల్లో పాల్గొన్నాడో ఎంతమందిని హత్యచేశాడో! ఆ చివరిరోజునకూడా 15 తుపాకులమీదా, ఒక్క గొడ్డలితో ఎల్లా విరుచుకుపడ్డాడో! అంతా వివరంగా

ఒక్కటే విచారం... తన వీరోచితత్వాన్ని పత్రికల్లోనైనా చూచుకోలేకపోయాడు సీతారాముడు.

ఏమనుకుంటే ఏమిలాభం? వాడి పెళ్లాం, మామా, తండ్రి, అంతా వాడి ప్రాణాన్ని ఎంతగా చూచుకున్నా ఆప్రాణం విలువ ఒక్క తుపాకి గుండే...